## 28న కొండగట్టు ఆలయం మూసివేత

• చంద్రగ్రహణం ఎఫెక్ట్

మల్యాల, అక్టోబర్ 24: చంద్రగ్రహణం నేపథ్యంలో ఈ నెల 28న కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానాన్ని మూసివేయనున్నట్లు ఈవో టంకశాల వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రధానద్వారం మూసివేసి మరుసటి రోజు ఆదివారం ఆలయ సంప్రోక్షణ అనంతరం ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

డాక్యుమెంట్ పోయినది

Pathi Suguna W/o Madusudan Reddy, age: 78 yrs, R/o. H.No. 3-97, Narsingapur village of Veenavanka mandal, Karimnagar Dist, తేది: 4-09-2023 రోజున సెంటినరి కాలనీలోని జిరాక్స్ సెంటర్ నుండి నా కొడుకు ఇంటికి Q.No. ST2-1134 సెంటినరికాలనికి వెలుతున్న క్రమంలో దస్తావేజులు (Original Documents) No: 5765/2005 పడిపోయినవి. ఎవరికైన దొరికిన యెడల సంప్ర|| సెల్: 9553085777. ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

# కాంగ్రెస్ వస్తే మళ్లీ అంధకారమే

• రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్
• కథలాపూర్‌లో ప్రచారం


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

కథలాపూర్, అక్టోబర్ 24: 'రాష్ట్రాన్ని, దేశాన్ని ఏండ్లకేండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదు. అందరినీ ఆగం పట్టించారు. కరెంట్ కోతలతో రైతులకు చుక్కలు చూపించారు. ఇప్పుడు మళ్లీ ఆగం చేసేందుకు వస్తున్నరు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటే చాలని ఆ పార్టీ అధ్యక్షుడు అంటున్నరు. ఎట్లా సరిపోతదో చెప్పాలి. నేనొక్కటే చెబుతున్నా.. వాళ్లను నమ్మితే తెలంగాణ మళ్లీ అంధకారం అవుతుంది. మళ్లీ పాతరోజులే వస్తయి. చేను నీళ్లు పెట్టేందుకు రాత్రిపూట లైట్లు పట్టుకొని బాయికాడికి పోయే రోజులు, యూరియా, ఎరువుల కోసం పోలీస్‌స్టేషన్లలో క్యూలో నిలబడాల్సిన పరిస్థితులు వస్తయని, మళ్లీ ఆ బాధలు మనకు అవసరమా..? ఆలోచించండి' అంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కథలాపూర్ మండలకేంద్రంలో వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు మద్దతుగా కారు గుర్తుకు ఓటేయాలని కోరుతూ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డితో కలిసి ప్రచారం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. అనంతరం విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఎట్లా సరిపోతదో చెప్పాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో వ్యవసాయానికి పుష్కలంగా కరెంటిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం 5 గంటల కరెంట్ ఇస్తున్నదని, దీంతో అక్కడి రైతులు ఆందోళనలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అక్కడి ముఖ్యమంత్రి సైతం అంతకంటే ఎక్కువ కరెంట్ ఇవ్వలేమని తేల్చిచెప్పారని, అక్కడి మంత్రులు కూడా 5 గంటలే ఇస్తామని అంటున్నారని.. అలా రైతులను మోసం చేసి గద్దెనెక్కారని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ మాటలు నమ్మితే పాతరోజులే వస్తాయని, రాష్ట్రం చీకట్లోకి వెళ్లిపోతుందని, వ్యవసాయం వెనక్కి వెళ్లిపోతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని తెల్లరేషన్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా' చాలా గొప్పదని, ఈ పథకం పేదలకు ఒక భరోసానిస్తుందని వివరించారు. ఇలా పేదలకు మేలు చేసేలా సరికొత్త పథకాలతో సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టో తయారు చేశారని చెప్పారు. పెన్షన్ల విషయంలో మనం చాలా క్లారిటీగా ఉన్నామని మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. పదేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రశాంతంగా ఉందని, తెలంగాణను ఆగం పట్టించేందుకు కాంగ్రెస్ నేతలు వస్తున్నారని మండిపడ్డారు. 1969లో తెలంగాణ ఉద్యమం జరిగితే ప్రత్యేక రాష్ట్రం రాకుండా కాంగ్రెస్ అనేక కుట్రలు చేసిందని, 360 మంది యువత ప్రాణాలు కోల్పోవడంలోనూ ఆ పార్టీ పాత్ర ఉందని మండిపడ్డారు. 'నేనొక్కటే అడుగుతున్నా.. వ్యవసాయానికి 24 గంటల కరెంటిచ్చే బీఆర్‌ఎస్ కావాలా..? 3 గంటలు మాత్రమే ఇస్తామంటున్న కాంగ్రెస్ కావాలో'.. రైతులు తేల్చుకోవాలని సూచించారు. కాగా, అంతకుముందు కథలాపూర్ మండలకేంద్రంలో కేవలం వృద్ధులే ఒక బృందంగా ఏర్పడి ఇంటింటా ప్రచారం చేస్తున్న తీరును చూసి వినోద్‌కుమార్ సంతోషపడ్డారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. వృద్ధులే ప్రజలకు మంచి చెప్పాలని, పథకాలను అర్థమయ్యేరీతిలో వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్‌ఎస్ నాయకులు వర్ధినేని నాగేశ్వర్‌రావు, గుండారపు గంగాధర్, సోమ దేవేందర్‌రెడ్డి, కల్లెడ శంకర్, మిర్యాల వెంకటేశ్వర్‌రావు, సబ్బని గంగు, నాంపెల్లి లింబాద్రి, ఎం.డీ రఫీ, ముంజ దశాగౌడ్, రిక్కల సంజీవ్‌రెడ్డి, కేసరి సాయన్న, రామాంజనేయులు, రాయికంటి శేఖర్, ముదాం రవి, కిషన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఓంకార్, స్వాగత్ చారీ పాల్గొన్నారు.

# బండిని నమ్మితే నట్టేట ముంచిండు

• స్థానిక నాయకులు, కార్యకర్తలతో చర్చించకుండా టికెట్లు కేటాయింపా?
• నర్సంపేటకు చెందిన రాణిరుద్రమకు టికెట్ ఎట్ల ఇస్తరు?
• బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి రమాకాంత్ ఫైర్
• పార్టీకి, కార్యవర్గ సభ్యత్వానికి రాజీనామా.. బీఆర్‌ఎస్‌లో చేరిక


బీజేపీకి రాజీనామా చేసిన న్యాయవాది ఆవునూరి రమాకాంతారావును బీఆర్‌ఎస్‌లో చేరాలని ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సీనియర్ నేత చీటి నర్సింగరావు, టీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): బండి సంజయ్‌ను నమ్మి బీజేపీలో చేరితే నట్టేట ముంచాడని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది ఆవునూరి రమాకాంత్‌రావు మండిపడ్డారు. స్థానిక కార్యకర్తలు, నాయకులతో చర్చించకుండా నర్సంపేటకు చెందిన రాణిరుద్రమకు సిరిసిల్ల టికెట్ ఎట్ల ఇస్తారని ప్రశ్నించారు. ఇన్నేండ్లుగా కష్టపడిన తనకు నమ్మక ద్రోహం జరిగిందని, పార్టీ, కార్యవర్గ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీలో అంత ఒంటెద్దుపోకడలేనని, సమన్వయ లోపం ఉన్న ఈ పార్టీలో తాను పని చేయలేనని స్పష్టం చేశారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో పైకి కనపడేది సిద్ధాంతమని, లోపల మాత్రం అన్ని గ్రూపు రాజకీయాలేనని విమర్శించారు. ఒక నాయకుడితో మాట్లాడితే ఇంకో నాయకుడికి కోపమని, కార్యకర్తలు, కింది స్థాయి నాయకులను చిత్రవధ చేస్తున్న వంటి పార్టీ బీజేపీనేని మండిపడ్డారు. రాణిరుద్రమకు సిరిసిల్ల అసెంబ్లీ అభ్యర్థిగా టికెట్ ఇచ్చి గెలిపించుకుంటామని, గతేడాదే నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందని, ఆ నిర్ణయమేదో పార్టీలోని కార్యకర్తలకు తెలిపితే సహకరించేవాళ్లమన్నారు. రాజకీయాల్లో నమ్మకమే ప్రధాన పెట్టుబడని, నాయకత్వాన్ని నమ్మి పార్టీలో చేరి నాలుగున్నర సంవత్సరాలు కష్టపడిన మాకు నీవిచ్చే ఫలితం ఇదేనా అంటూ.. బండిని నిలదీశారు. నా ప్రశ్నకు బండి సంజయ్ సమాధానం చెప్పి తీరాల్సిందేనన్నారు. నన్ను పార్టీలోకి ఆహ్వానించిన సంజయే.. ఏడాది క్రితం నుంచే ప్రస్తుత అభ్యర్థిని బలపరిచి మమ్మల్ని నట్టేట ముంచారని మండిపడ్డారు. బీజేపీని నమ్మి నాలుగున్నర ఏండ్ల కింద పార్టీలో చేరానని, 25ఏండ్ల తన న్యాయవాద వృత్తి, భార్యాపిల్లలను పక్కనపెట్టి పార్టీ ఎదుగుదల కోసం కష్టపడ్డానని చెప్పారు. పార్టీ తీసుకున్న నిర్ణయాలు చాలా బాధ కరం అనిపించి మీడియా ద్వారా ప్రజలకు వాస్తవాలు తెలుపాలని ముందుకొచ్చినట్లు తెలిపారు. బండి సంజయ్‌ను కలిసి మాలో ఎవరికైనా టికెట్ ఇవ్వాలని అడిగితే అధిష్ఠానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని చెప్పారన్నారు. తాము రాష్ట్ర నాయకత్వాన్ని సంప్రదిస్తే మీది ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గమని, ఆయన నిర్ణయమే మేరకే అభ్యర్థిని ఎంపిక చేసినట్లు సమాధానం ఇచ్చారన్నారు. కార్యకర్తలకు చెప్పకుండా నిర్ణయాలు తీసుకోవడం మామనోభావాలు, ఆత్మగౌరవాన్ని కించపర్చడమేనన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజా శ్రేయస్సు గురించి పోరాటం చేసే వ్యక్తులనే గౌరవించాలని, నమ్మించి నట్టేట ముంచేవారిని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. తన రాజీనామా పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్‌కి పంపించినట్లు తెలిపారు.

### బీజేపీకి షాక్.. బీఆర్‌ఎస్‌లో చేరిక

సిరిసిల్ల బీజేపీలో ముసలం మొదలైంది. పార్టీని వీడి ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. పార్టీలో గ్రూపు రాజకీయాలున్నాయని ఆరోపిస్తూ ఆ పార్టీకి రాజీనామా చేసిన సిరిసిల్లకు చెందిన ప్రముఖ న్యాయవాది ఆవునూరి రమాకాంత్‌రావు తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మంగళవారం ఆయన బీజేపీకి రాజీనామా చేసిన వెంటనే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సీనియర్ నాయకుడు చీటి నర్సింగరావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌తో మంతనాలు జరిపారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరాలని వారి ఆహ్వానం మేరకు.. రమాకాంత్‌రావు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమక్షంలో చేరారు. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ గెలుపు కోసం తన శక్తి మేరకు పనిచేస్తానని రమాకాంత్‌రావు తెలిపారు.

## అత్తారింటికి వెళ్తూ..

• రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
• పండుగ పూట లొంకకేసారంలో విషాదం

రామగిరి, అక్టోబర్ 24 : పండుగ పూట సంబురంగా అత్తారింటికి వెళ్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. మంగళవారం రామగిరి మండలం పన్నూరు ఎక్స్‌రోడ్డు వద్ద జరిగిన ఈ ఘటనతో మృతుడి స్వగ్రామమైన లొంకేసారంలో విషాదం నెలకొంది. లొంకకేసారం గ్రామానికి చెందిన కారుపాకల సదయ్య(40) మంగళవారం తన బైక్‌పై బేగంపేట గ్రామంలోని అత్తవారింటికి వెళ్తుండగా, సాయంత్రం పన్నూరు ఎక్స్‌రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సదయ్య తలకు బలమైన గాయాలు కాగా, స్థానికులు గమనించి చికిత్స కోసం గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి ప్రసాద్ తెలిపారు.

## బంధువుల ఇంటికి వచ్చి

• నీటి సంపులో పడి చిన్నారి మృతి
• వన్నారంలో విషాదం

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 24 : అమ్మమ్మ ఇంటికి వచ్చిన చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ఇంటి వద్ద నీటి సంపులో పడి మృతి చెందగా, వన్నారంలో విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అకరాజుపల్లి గ్రామానికి చెందిన ఆకుల రాధికనాగరాజు దంపతుల కుమార్తె ఆకుల రిత్విక (4)తో కలిసి బంధువైన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వన్నారం గ్రామానికి చెందిన బుద్దుల పద్మపరశురాము ఇంటికి వచ్చారు. వీరికి ఇద్దరు మగపిల్లలు, ఆడపిల్లలు లేకపోవడంతో ప్రతి పండుగకు రాధికను తీసుకువచ్చేవారని, అందులో భాగంగానే శుక్రవారం కుమార్తె రిత్విక్‌తో కలిసి వచ్చినట్లు తెలిపారు. పండుగ పూట ఇంట్లోనే ఉన్న చిన్నారి సోమవారం రాత్రి సమయంలో ఆడుకుంటూ ఇంటి ఆవరణలోనే ఉన్న సంపులో పడిపోయింది. వెంటనే బంధువులు కలిసి కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు, అక్కడ డాక్టర్లు పరిశీలించి, చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి, స్వగ్రామం ఆకరాజులపల్లికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. కుమార్తె మృతితో తల్లి దండ్రులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. పండుగ పూట విషాదం నెలకొంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

## రామగుండం బీ థర్మల్‌లో మంటలు

జ్యోతినగర్(రామగుండం), అక్టోబర్ 24: పెద్దపల్లి జిల్లా రామగుండం 62.5మెగావాట్ల రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. బాయిలర్‌లో బొగ్గును మండిస్తున్నప్పుడు కోల్‌ఫైర్ బయటకు రావడంతో పవర్‌కేబుల్ అంటుకొని మంటలు చెలరేగాయి. సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది, అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని నివారణ చర్యలు చేపట్టారు. ప్రమాదంతో కొంతమేరకు ఆస్తినష్టం జరిగినప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. కాగా, మంటలు అర్ధరాత్రి వ్యాపించడంతో ప్రమాద ఘటన కారణాలు తెలియరాలేదు. ప్రస్తుతం ప్లాంటులో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది.